ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం, 22 జూన్ 2024 www.prajaswaramdaily.com 2PM



# టెన్షన్.. టెన్షన్..

హైదరాబాద్, జూన్ 22 (ప్రజాస్వరం): కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి వద్ద శనివారం ఉదయం హైటెన్షన్ వాతావారణం నెలకొంది. నీట్ పరీక్ష రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు కాచిగూడలోని ఆయన ఇంటిని ముట్టడించాయి. కాంగ్రెస్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.





# ట్విటర్ వార్

## బొగ్గు గనుల వేలంపై రేవంత్, కేటీఆర్ మాటల యుద్ధం

### పీసీసీ అధ్యక్షుడిగా వద్దన్నరు : కేటీఆర్

### అప్పుడు ఇచ్చింది మీరే కదా : రేవంత్




హైదరాబాద్, జూన్ 22, (ప్రజాస్వరం): సింగరేణిలో బొగ్గు గనుల వేలంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలే కాదు.. ట్వీట్ ఫైట్లూ కంటిన్యూ అవుతున్నాయి. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రేవంత్ రెడ్డి గారూ .. అంటూ కేటీఆర్ ట్వీట్ ద్వారా ప్రశ్నిస్తే.. కేటీఆర్ గారూ అంటూ రిప్లై ఇచ్చారు రేవంత్. పీసీసీ అధ్యక్షుడిగా 2021లో బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని, 4 బ్లాక్ లను సింగరేణికి బదిలీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలంటూ నాటి రేవంత్ రెడ్డి చేసిన ట్వీట్ ను రీట్వీట్ చేశారు కేటీఆర్. అప్పుడు వేలాన్ని వ్యతిరేకించి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక వేలం పాట కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను పంపించడం ఏంటని ప్రశ్నించారు. మీలో మార్పుకు గల కారణాలు చెప్పాలని ఎక్స్ వేదికగా నిలదీశారు. కేటీరామారావు ట్వీట్ ను రేవంత్ రెడ్డి రీట్వీట్ చేస్తూ పాయింట్ టూ పాయింట్ రిప్లై ఇచ్చారు. తెలంగాణ సంస్థల ప్రైవేటీకరణను, తెలంగాణ ప్రజల వాటాల విక్రయానికి కేంద్రం పూనుకున్నా, కేసీఆర్ ప్రభుత్వం ప్రయత్నించినా, కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు అడుగడుగునా వ్యతిరేకించారని వెల్లడించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేంద్రం సింగరేణి గనులను తొలిసారి వేలం వేసిందని, రెండు ప్రైవేటు కంపెనీలకు అప్పగించిందని అన్నారు. అప్పుడే అరబిందో, అవంతిక కంపెనీలకు కట్టబెట్టిందని చెప్పారు. అప్పుడు బీఆర్ ఎస్ ఎందుకు మాట్లాడలేదు..? అని కేటీఆర్ ను ప్రశ్నించారు. సింగరేణి గనులను ప్రైవేటీకరించడం, వేలం వేయడాన్ని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అప్పుడే వ్యతిరేకించారని తెలిపారు. అవంతిక, అరబిందో కంపెనీలకు అప్పగించిన బొగ్గు బ్లాకులను రద్దు చేసి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారని వెల్లడించారు. ఈ మేరకు భట్టి విక్రమార్క రాసిన లేఖను జత చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలు, ఆస్తులు, హక్కులను కాపాడేది కాంగ్రెస్ పార్టీ ఒకటేనన్నారు. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్ తోనే సురక్షితం. మన బొగ్గు.. మన హక్కును కాపాడి తీరుతాం అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ కు రిప్లై ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి.



# కాల్పుల కలకలం..

## పోలీసుల క్లారిటీ

హైదరాబాద్, జూన్ 22 (ప్రజాస్వరం): హైదరాబాద్ నడిబొడ్డులో కాల్పులు కలకలం సృష్టిస్తున్నాయి. సికింద్రాబాద్ లో కాల్పుల కలకలంపై పోలీసుల క్లారిటీ సికింద్రబాద్ లోని మెట్టగూడలో కాల్పుల కలకలంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దొంగలను నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళికల్లో భాగంగా యాంటీ డెకాయిట్ టీం సభ్యులు సర్ ప్రైజ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా డెకాయిట్ టీం సభ్యులు మారువేషంలో ఫుట్ పాత్ పై పడుకున్నాడు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన దొంగల ముఠా ఫుట్ పాత్ పై పడుకున్న వ్యక్తి ఫోన్ ను చోరీ చేసేందుకు ప్రయత్నించారు. దీంతో యాంటీ డెకాయిట్ టీం సభ్యుడు అతన్ని పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో దొంగల ముఠాకు డెకాయిట్ టీం సభ్యులకు తోపులాట జరిగింది. ఈ క్రమంలో పోలీస్ వద్ద ఉన్న రివాల్వర్ మిస్ ఫైర్ అయినట్లు పోలీసులు స్పష్టం చేశారు. అలాగే గత కొద్ది రోజులుగా దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే పరారీలో ఉన్న వారి కోసం గాలింపు కొనసాగుతుందని అన్నారు.



# నగల షాప్‌లో చోరీ..

## 24 గంటల్లో చేధించిన పోలీసులు

మేడ్చల్, జూన్ 22 (ప్రజాస్వరం): ఇటీవల మేడ్చల్లో పట్టపగలే నగల దుకాణంలో యజమానిని కత్తితో పొడిచి దోపిడీకి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా హల్ చల్ అయింది. ఈ కేసును మేడ్చల్ పోలీసులు 24 గంటల్లో చేధించారు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు నిందితులను పట్టుకున్నారు. అయితే, నిందితులకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. వారిని పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, మేడ్చల్ పట్టణంలో గురువారం మధ్యాహ్నం ప్రాంతంలో ఒక వ్యక్తి బురఖా వేసుకోని.. మరోవ్యక్తి హెల్మెట్ పెట్టుకుని నగల దుకాణంలోకి చొరబడ్డారు. యజమాని శేషారాంను బంగారం, వెండి నగలు ఇవ్వాలని ఛాతిపై పొడిచాడు. శేషారాం వారిని తప్పించుకొని బయటికొచ్చి అరవడంతో దొంగలు పారిపోయిన విషయం తెలిసిందే.

# హరీశ్, కేసీఆర్ వచ్చినా స్వాగతిస్తా

## ఎంపీ రఘు నందన్ రావు




హైదరాబాద్, జూన్ 22, (ప్రజాస్వరం): టైటానిక్ షిప్ లా బీఆర్ఎస్ మునిగిపోతుందని చరిత్రలో రాసుకోవాల్సిందేనని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు సీఆర్ఎస్ (కంపల్సరీ రిటైర్మెంట్ స్కీం) ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అగ్రనేతలు హరీష్ రావు, కేసీఆర్ బీజేపీలోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తామని సెటైర్లు వేశారు. ములుగు మండలం క్షీర సాగర్ గ్రామంలో 80 మంది దళితుల భూములు అక్రమంగా వెంకట్ రాం రెడ్డి లాక్కున్నారన్నారు. క్షీర సాగర్ నుంచే పని మొదలుపెడతా.. దళితుల భూములు వారికి అప్పగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు గైడ్ లైన్స్ అన్ని అమలు చేశామన్నారు. ఐటీఐఆర్ ప్రాజెక్ట్ టెక్నికల్ గా మాత్రమే రద్దు అయ్యిందని, ఐటీఐఆర్ గురించి తెలిస్తే కాంగ్రెస్ నేత జగ్గారెడ్డితో చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. జగ్గారెడ్డి పెరిగింది ఆర్ఎస్ఎస్‌లో.. ఆయన మొదట గెలిచింది బీజేపీ నుంచే అని గుర్తుచేశారు. జగ్గారెడ్డి తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్టు ఉందని తీవ్ర విమర్శలు గుప్పించారు. మెదక్‌కు ఇందిరమ్మ రాకముందే బీహెచ్ఈఎల్, ఇక్రిశాట్ వచ్చాయన్నారు. సమ్మిళితంగా మెదక్ ను డెవలప్ చేస్తామని, నిజాం షుగర్ ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తామని హామీ ఇచ్చారు. నీట్ పరీక్షపై ప్రతిపక్షాలు బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నాయని, కోర్టు ముందు కేంద్ర ప్రభుత్వం అన్ని వివరాలు ఇవ్వనుందని స్పష్టంచేశారు. మరోవైపు ఆయన గోవధ అల్లర్లు, కంపెనీల మీద స్పందించారు. అటువంటి కంపెనీలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# వైసీపీ కార్యాలయం కూల్చివేత

అమరావతి, జూన్ 22 (ప్రజాస్వరం): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరంలో వైసీపీ సెంట్రల్ ఆఫీస్ కార్యాలయాన్ని సీఆర్డీఏ అధికారులు శనివారం తెల్లవారు జామున కూల్చివేశారు. ఇక, ఈ ఘటనపై ట్విట్టర్ వేదికగా మాజీ సీఎం జగన్ స్పందించారు. ఏపీలో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగిన చంద్రబాబు తన దమనకాండను మరోస్థాయికి తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారని, రాష్ట్రంలో చట్టం, న్యాయం పూర్తిగా కనుమరుగైపోయాయని మండిపడ్డారు. చంద్రబాబు ఐదేళ్ల పాలన ఎలా ఉండబోతుందనే సందేశాన్ని ఇవ్వకనే ఇస్తున్నారన్నారు. బెదిరింపులకు, కక్ష సాధింపు చర్యలకు వైఎస్సార్సీపీ తలొగ్గేది లేదని తేల్చిచెప్పారు. ప్రజల తరఫున, ప్రజల కోసం, ప్రజల తోడుగా గట్టి పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. దేశంలోని ప్రజాస్వామ్య వాదులంతా చంద్రబాబు దుశ్చర్యల్ని ఖండించాలని పిలుపునిచ్చారు.





# ఏపీ స్పీకర్‌గా అయ్యన్న

అమరావతి, జూన్ 22 (ప్రజాస్వరం): ఏపీ అసెంబ్లీ 16వ స్పీకర్ గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ గా అయ్యన్న పాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. కాగా, 1983లో అయ్యన్నపాత్రుడు రాజకీయ రంగప్రవేశం చేశారు. 1983-89, 1994-96 ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1984-86లో సాంకేతిక విద్యా మంత్రిగా అయ్యన్నపాత్రుడు సేవలందించారు. 1994-96లో రహదారులు, భవనాలశాఖ మంత్రిగా పనిచేశారు. 1996లో అనకాపల్లి నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1999లో అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల పాప చేతిలో ఓటమి చెందారు. 2014లో పంచాయతీరాజ్, రవాణా శాఖ మంత్రిగా పనిచేశారు. 2019లో వైసీపీ అభ్యర్థి గణేష్ చేతిలో ఓటమి చెందారు. 2024లో వైసీపీ అభ్యర్థిపై 24వేల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ.. అయ్యన్నపాత్రుడికి అభినందనలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యంత సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు అన్నారు.